


మన
# భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం




మంగళవారం 22 సెప్టెంబర్ 2026 ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం పేజీలు :- 3

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి





భానుపురి /సూర్యాపేట కలెక్టరేట్

ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి సోమవారం జరుగు ప్రజావాణి కి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. ప్రతి అధికారి తమ లాగిన్ లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని లేనియెడల వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణి కి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మండల స్థాయి సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి, రెవిన్యూ కి సంబందించి 56 దరఖాస్తులు, డిపిఓ 4, డిడబ్ల్యూ ఓ 7, మునిసిపల్ 4, ఆర్ డి ఓ లు 6, మిగిలిన 21 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 98 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్బంగా అన్నారు. అనంతరం కోదాడ జాబ్ మేళాలో పనిచేసిన అదనపు కలెక్టర్, డిఆర్ఓ, సిఈఓ జడ్పి జిఎం ఇండస్ట్రీస్, డిపిఓ, డిపిఆర్ఓ, డిఐఈఓ, ఫైర్, ట్రాన్స్పోర్ట్, మున్సిపల్ కమిషనర్, ఆర్డీవోలు సంబంధిత శాఖల అధికారులను, సిబ్బంది ని అభినందనలు తెలిపిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, డిఎంహెచ్వో వెంకటరమణ, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిఎస్ఓ మోహన్ బాబు, డిడబ్ల్యూఓ నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి , జిల్లా అధికారులు తదితరులు హాజరైనారు.

## సూర్యాపేటకు రైల్వే లైన్ సాధించే వరకు ఉద్యమం ఆగదు




భానుపురి /సూర్యాపేట టౌన్

సూర్యాపేట జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ఒక రైల్వే మార్గం ఏర్పాటు కావలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రైల్వే సాధన సమితి సామాజిక సంఘాల జేఏసీ కన్వీనర్, పెరిక సంఘం జిల్లా అధ్యక్షులు సముద్రాల రాంబాబు అన్నారు. సూర్యాపేటకు రైల్వే లైన్ కావాలని కోరుతూ ప్రధాన మంత్రికి లక్ష పోస్టుకారులు వేసే కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ప్రధానమంత్రి కి ప్రజలతో పోస్ట్ కార్డులు రాయించి మాట్లాడారు. స్వాతంత్ర వచ్చి 70 సంవత్సరాలు అవుతున్న సూర్యాపేటకు రైల్వే మార్గం లేకపోవడం బాధాకరమన్నారు. సూర్యాపేట జిల్లా పరిసర ప్రాంతాల్లో రైల్వే లైన్ ఉన్నప్పటికీ సూర్యాపేటకు రైల్వే లైన్ లేకపోవడంతో అన్ని రంగాల్లో వెనుకబడి ఉందన్నారు. సూర్యాపేటకు రైల్వే లైన్ వచ్చే వరకు రైల్వే సాధన సమితి ముందుండి పోరాడుతుందని అన్నారు. సూర్యాపేటకు తక్షణమే రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రధానికి లక్ష పోస్టు కార్డులు ఉద్యమాన్ని చేపట్టామని ఈ ఉద్యమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైల్వే సాధన సమితి నాయకులు రాచూరి ప్రతాప్, చింతలపాటి చిన్న శ్రీరాములు, డాక్టర్ రమేష్ చంద్ర, కొన్నే మంజుల, నల్లపాటి అప్పారావు, అక్కెనపల్లి రాము, నారబోయిన వెంకట్, యాతాకుల రాజన్న, బుల్లెద్దు వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష పోస్టు కార్డుల ఉద్యమానికి ఆర్యవైశ్యుల మద్దతు



భానుపురి /సూర్యాపేట టౌన్

సూర్యాపేట మీదుగా రైల్వే లైన్ సాధించే దిశగా రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో గత పది రోజులుగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రధానమంత్రి లక్ష పోస్టు కార్డుల ఉద్యమం ఉధృతంగా సాగుతోంది. అందులో భాగంగా సోమవారం శ్రీ వాసవి రక్షణ కవచం సభ్యులు పోస్ట్ కార్డు ఉద్యమానికి మద్దతు పలుకుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉత్తరాలు వ్రాశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేట ప్రజలు ఎన్నో ఏళ్లుగా కలలు కంటున్న రైల్వే లైన్ మార్గం కలలు గానే మిగిలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చిన రైలు మార్గం కొంతమంది స్వార్థపరుల ఆలోచనలతో దారి మళ్లుతున్న రైలు మార్గాన్ని సూర్యాపేట దిశగా ప్రయాణించే వరకు ఉద్యమాలు నిర్వహిస్తూనే ఉంటామని తెలిపారు. ప్రధానమంత్రి కి చేరే విధంగా లక్ష కార్డుల ఉద్యమంలో ప్రజలంతా స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైల్వే సాధన సమితి నిర్వాహకులు రాచూరి ప్రతాప్, సముద్రాల రాంబాబు, కోన్నె మంజుల, శ్రీ వాసవీ రక్షణ కవచం సభ్యులు తప్పీ గాంధీ, కలకోట లక్ష్మయ్య ,చల్లా సత్యనారాయణ, బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి జలాల ద్వారా సాగు, త్రాగునీరు ఇవ్వాలి

-గ్రామీణ పేదల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొనకంచి వీరభద్రయ్య

-ఓపిడిఆర్ జిల్లా కార్యదర్శి సుంకరి రమేష్ బాబు




భానుపురి /సూర్యాపేట టౌన్

జిల్లావ్యాప్తంగా ఎల్ నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావం దృష్ట్యా పంటలు ఎండిపోయి రైతన్నలు దిక్కుతోచిన పరిస్థితుల్లో ఉన్నారని ప్రభుత్వం వెంటనే సూర్యాపేట ను కరువు జిల్లాగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలని గ్రామీణ పేదల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొనకంచి వీరభద్రయ్య, ఓపిడిఆర్ జిల్లా కార్యదర్శి సుంకరి రమేష్ బాబు, నాయకులు వై, సురేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈఏడాది సకాలంలో వర్షాలు కురవక పత్తి, కంది, వరి పొలాలు,ఇతర పంటలు వెండిపోతున్నాయని భూగర్భ జలాల అడుగంటుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్లంపల్లి, మిడ్ మానేరు ప్రాజెక్టు ద్వారా ఇటీవల వచ్చిన వర్షాలకు వరద నీరు వచ్చిన కనీసం , కోదాడ తుంగతుర్తి, సూర్యాపేట, నియోజకవర్గాలకు గోదావరి జలాలు ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చెరువులు నింపడం లేదని ఇవ్వడంలేదని తెలిపారు. గత ఏడాది నుంచి నీటిపారుదల శాఖ అధికారులకు, జిల్లా యంత్రాంగానికి ఎస్సారెస్పీ నీళ్లు ఇవ్వాలని అనేక పర్యాయాలు ఆందోళనలు వినతి పత్రాలు అందజేసిన ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని వారు ఆరోపించారు. మోతే మండలం నామవరం చెరువును రిజర్వాయర్ చేస్తే మునగాల, నడిగూడెం, మోతే, చివ్వెంల, మండలాలకు సాగు, త్రాగునీరు కుఇబ్బంది ఉండదని ప్రభుత్వం ఆలోచన చేయాలని సూచించారు. గతంలో అధికారులు, ప్రభుత్వం దృష్టికి ఇదే విషయాన్ని తీసుకెళ్లామని గుర్తు చేశారు. ఎల్ నినో ప్రభావం ఉంటుందని పూర్తిస్థాయిలో రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించలేదని అన్నారు. జాతీయ రహదారికి సమాంతరంగా శంషాబాద్,హైదరాబాద్, చౌటుప్పల్, చిట్యాల, సూర్యాపేట, విజయవాడ, అమరావతిలా మీదుగా బుల్లెట్ ట్రైన్ సదుపాయాన్ని కల్పించాలని అలైన్మెంట్ను యధావిధిగా ఉంచాలని వారు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సౌకర్యం ఉంటే సూర్యాపేట ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని చెప్పారు. రెండు లక్షల లోపు బ్యాంకులో తీసుకున్న రైతుల రుణాలను కూడా మాఫీ చేయాలని వారు కోరారు. సూర్యాపేట ను కరువు జిల్లాగా ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రకటించాలని లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా గ్రామీణ పేదల సంఘం, ఓపిడిఆర్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఓపిడిఆర్ నాయకులు మాజీ ఎంపిటిసి కోడిబండ్లయ్య, అనంతుల యల్లయ్య, ఎడ్ల వెంకన్న, వీరబోయిన వెంకన్న, శిగ రవి, పాలకూరి ఎల్లయ్య, తండు కృష్ణ, మండవ శ్రీను, వేణుగోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పేద ఆర్యవైశ్యులకు శ్రీ వాసవి రక్షణ కవచం తోడ్పాటు



భానుపురి /సూర్యాపేట టౌన్

పేద ఆర్యవైశ్యులకు సేవలు అందించాలనే లక్ష్యంతో ఆనాడు వాసవి క్లబ్బు స్థాపించి ఎంతోమంది పేదలకు సహకారం అందించిన స్వాతంత్ర సమరయోధులు, వాసవి క్లబ్ వ్యవస్థాపకులు కల్వకుంట్ల చంద్రసేన గుప్తా(కేసిగుప్త) ఆశయ సాధనలో సూర్యాపేట శ్రీ వాసవి రక్షణ కవచం కూడా పనిచేస్తుందని శ్రీ వాసవి రక్షణ కవచం గౌరవ సలహాదారులు తప్పీ గాంధీ, కలకోట లక్ష్మయ్య తెలిపారు. సోమవారం శ్రీ వాసవి రక్షణ కవచం నిర్వాహకులు బచ్చు పురుషోత్తం తో కలిసి జిల్లా కేంద్రంలోని పొట్టి శ్రీరాములు సెంటర్ లో ఏర్పాటు చేసిన కే సి గుప్తా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేటలో శ్రీ వాసవి రక్షణ కవచం స్థాపించి పేద ఆర్యవైశ్యులకు విద్య, వైద్యం, ఆర్థికం గా సహకారం అందిస్తుందని తెలిపారు. స్వాతంత్ర సమర యోధులు కేసి గుప్తా మనవడు సందీప్ గుప్త శ్రీ వాసవి రక్షణ కవచం కు 12 వేల రూపాయల ఆర్థిక సహకారం అందించారని తెలిపారు. శ్రీ వాసవి రక్షణ కవచం ద్వారా నెలకు రూపాయలు 100 చొప్పున దాతల నుండి విరాళములు సేకరించి ప్రతి నెల ఒక పేద ఆర్యవైశ్య కుటుంబానికి సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల నీల స్వరాజ్యలక్ష్మి కాలు ఆపరేషన్ నిమిత్తం పదివేల రూపాయలు ఆర్థిక సహకారం అందించినట్లు తెలిపారు. ఇప్పటివరకు శ్రీ వాసవి రక్షణ కవచం లో సుమారుగా 180 మంది సభ్యులు స్వచ్ఛందంగా చేరి పేద ఆర్యవైశ్యుల ఆర్థిక సహకారం కొరకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. శ్రీ వాసవి రక్షణ కవచం లో సభ్యులుగా చేరి పేద ఆర్యవైశ్యులకు సహకారం అందించాలన్నారు. శ్రీ వాసవి రక్షణ కవచం ద్వారా ప్రతినెల పేదఆర్యవైశ్య కుటుంబాలకు పదివేల రూపాయల చొప్పున ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నవారికి సహకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి రక్షణ కవచం సభ్యులు కందిమల్ల మధుసూదన్ ,చల్లా సత్యనారాయణ, సోమ ప్రవీణ్ కుమార్, గుడిపాటి రమేష్, జర్నలిస్ట్ కృష్ణయ్య, తల్లాడ కృష్ణమూర్తి, వీరవెల్లి ఉమ తదితరులు పాల్గొన్నారు

## శ్రీ వినాయకుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలి



భానుపురి/సూర్యాపేట కల్చరల్

అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని 30వ వార్డ్ కౌన్సిలర్ నామ అరుణ, 14వ వార్డ్ కౌన్సిలర్ గాలి సాయికుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం గజదంత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆరో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్న ప్రసాద వితరణ ను ప్రారంభించి మాట్లాడారు. గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరు సుఖసంతోషాలు ఆయురారోగ్యాలతో ఉండి వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల రమేష్, పల్స మల్సూర్ గౌడ్, దూలం నగేష్, అన్న ప్రసాద వితరణ దాతలు కౌన్సిలర్ గాలి సాయికుమార్, రామసాని సోమయ్య, విగ్రహం దాత వెంకట బుచ్చేశ్వరరావు శోభారాణి, పిశిక సత్యనారాయణ మంజుల, గణేష్ నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు పిశిక రాహుల్, హజారి విశాల్, నిఖిల్, భాను ప్రకాష్, బేతు వేణు, తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

భానుపురి/సూర్యాపేట ప్రతినిధి

బుధవారం గణేష్ నిమజ్జనాల కార్యక్రమాన్ని పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సద్దలచెరువు మినీ ట్యాంక్‌బండ్ వద్ద నిమజ్జన ప్రదేశాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహా, మున్సిపల్ చైర్మన్ నివేదిత లక్ష్మాధి , స్థానిక డిఎస్పీ, మున్సిపల్ కమిషనర్, స్థానిక కౌన్సిలర్లు, ఇతర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నిమజ్జన ఏర్పాట్లు, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్, పారిశుధ్యం, అగ్నిమాపక, విపత్తు నిర్వహణ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. మున్సిపల్, ఇరిగేషన్, విద్యుత్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఫైర్, పోలీస్ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను అందరూ కలిసిమెలిసి ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. నిమజ్జనం సందర్భంగా శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉత్సవ కమిటీలు, భక్తులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఉత్సవ కమిటీలు ముందస్తుగా నిమజ్జనానికి బయలుదేరి, వీలైనంత త్వరగా నిమజ్జనం పూర్తి చేసుకోవాలని సూచించారు. నిమజ్జనానికి వినియోగించే వాహనాలు పూర్తి కండిషన్‌లో ఉండాలని, వాహనాలపై పిల్లలను ఎక్కించరాదని స్పష్టం చేశారు. వృద్ధులు, మహిళలు నిమజ్జన ప్రదేశాలకు దూరంగా ఉండి భద్రతా సిబ్బందికి సహకరించాలని కోరారు. జిల్లా ఎస్పీ నరసింహా మాట్లాడుతూ గణేష్ నిమజ్జనాల కోసం జిల్లాలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నిమజ్జన ప్రదేశంలో క్రేన్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అన్ని కోణాల్లో భద్రతా చర్యలు చేపట్టి పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తామని తెలిపారు. యువత, ఉత్సవ కమిటీలు బాధ్యతాయుతంగా వ్యవహరించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ నివేదిత లక్ష్మాది మాట్లాడుతూ నిమజ్జన ప్రదేశంలో నీరు కలుషితం కాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. చెత్తను ఎప్పటికప్పుడు తరలించేందుకు



ప్రత్యేక వాహనాలను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. మున్సిపల్ సిబ్బందితో నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టి నిమజ్జన ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుతామని తెలిపారు. గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ అధికారులకు సహకరించాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, ఆర్డిఓ వేణు మాధవరావు, స్థానిక డిఎస్పి ప్రసన్నకుమార్, పట్టణ, రూరల్ ఇన్స్పెక్టర్లు వెంకటయ్య రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, ఫైర్ ఎస్ఐ జానయ్య, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అనంతల కృపాకర్ సభ్యులు రంగరాజు రుక్మారావు చల్ల మల్ల నరసింహ కౌన్సిలర్లు గండూరి రమేష్ కుమ్మరకుంట్ల వేణు కొనతం రాజేష్ రెడ్డి రాపర్తి శీను, ఈఈ కిరణ్, డి ఈ ప్రణయ్ రెడ్డి, ఏఈ తిరుమలేష్, మున్సిపల్ మేనేజర్ ఎం బుచ్చిబాబు అదేవిధంగా మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. కారింగుల ఉపేందర్, బండపల్లి పాండురంగ చారి,తన్నీరు వాసు,కోడి లింగయ్య తదితరులు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ సిబ్బందికి రెయిన్ కోట్స్





భానుపురి /సూర్యాపేట ఎస్పీ కార్యాలయం

వర్షాకాలంలో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది సౌకర్యం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర పోలీస్ శాఖ నుండి సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖకు కేటాయించిన రెయిన్ కోట్స్‌ను జిల్లా ఎస్పీ నరసింహా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఆర్ పోలీస్ సిబ్బందికి స్వయంగా తన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహా మాట్లాడుతూ, పోలీస్ సిబ్బంది సంక్షేమానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రాధాన్యతనిస్తూ, అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో కూడా పోలీస్ సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రజలకు తమ సేవలు సమర్థవంతంగా అందించాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలనిఎస్పీ సూచించారు. ప్రజల సమస్యలకు స్పందిస్తూ, వారి భద్రతకు ఎల్లప్పుడూ అండగా నిలవాలని, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. పోలీస్ సిబ్బంది ఆరోగ్యం, భద్రతతో పాటు విధి నిర్వహణకు అవసరమైన మౌలిక సౌకర్యాల కల్పనకు జిల్లా పోలీస్ శాఖ తరఫున తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, పోలీస్ సంఘం అధ్యక్షుడు రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కిరణ్ ఏఆర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులపై వేగంగా పోలీస్ సేవలు



భానుపురి/సూర్యాపేట ఎస్పీ కార్యాలయం

సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పోలీసు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, వినతులను పరిశీలించారు. ప్రజలు అందించే ఫిర్యాదులపై పోలీసులు తక్షణమే స్పందించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు భరోసా కల్పించాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సేవలు, తక్షణ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. ప్రజా రక్షణ కోసం పోలీసు సిబ్బంది అనుక్షణం విధులు నిర్వర్తిస్తున్నారని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలు గొడవలు, తగాదాలకు దూరంగా ఉండాలని, సమస్యలు వచ్చినప్పుడు దాడులకు పాల్పడకుండా ఇరు వర్గాలు పెద్దల సమక్షంలో సామరస్యపూర్వకంగా, చట్ట పరిధిలో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

## గ్రీన్ క్లబ్ ట్రస్ట్ పదో వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



భానుపురి /సూర్యాపేట ప్రతినిధి

గ్రీన్ క్లబ్ ట్రస్ట్ 10 వ వార్షికోత్సవ పోస్టర్ను జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగాపర్యావరణ పరిరక్షణ కోసం విశేషంగా కృషి చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న గ్రీన్ క్లబ్ ట్రస్ట్ కు ప్రత్యేక శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో జిల్లా ఎస్పీ కే నరసింహ, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత, మున్సిపల్ కమిషనర్ సిహెచ్ హనుమంత రెడ్డి ఆర్డిఓ వేణు మాధవరావు, గ్రీన్ క్లబ్ ట్రస్ట్ అధ్యక్షుడు ముప్పారపు నరేందర్ కుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ తోట కిరణ్, కోశాధికారి ఉప్పల శ్రవణ్, సహాయ కార్యదర్శి దేవర్శెట్టి నాగరాజు, కార్యవర్గ సభ్యులు మిరియాల వెంకటేశ్వర్లు, తల్లాడ రామచంద్రయ్య, తౌనుకునూరు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో ఒక జిల్లాకు బాపూజీ పేరు పెట్టాలి

భానుపురి/సూర్యాపేట టౌన్

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆయన జీవిత చరిత్ర, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పోషించిన కీలక పాత్ర, సామాజిక ఉద్యమాల నిర్మాణంలో చేసిన కృషి, స్వాతంత్ర్యోద్యమంలో ఆయన అనుభవాలు, ప్రజాసేవను భవిష్యత్ తరాలకు అందించేలా హైదరాబాద్‌లో ప్రభుత్వం కొండా లక్ష్మణ్ బాపూజీ స్మారక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని చేనేత సహకార సంఘం డైరెక్టర్ యలగందుల సాయినేత కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 97 ఏళ్ల వయసులోనూ ఢిల్లీ వీధుల్లో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆకలితో నిలబడి దీక్ష చేసిన అలుపెరగని పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు. తెలంగాణ కోసం జీవితాంతం పోరాడిన ఆయన త్యాగాలు, సేవలు, ఉద్యమ స్ఫూర్తిని నేటి యువతకు, భావితరాలకు పరిచయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. బాపూజీ నివాసమున్న జలదృశ్యం మార్గానికి 'కొండా లక్ష్మణ్ బాపూజీ మార్గ్'గా నామకరణం చేయాలని, తెలంగాణలోని ఏదైనా ఒక జిల్లాకు ఆయన పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే బాపూజీ జీవిత చరిత్రను రాష్ట్ర పాఠ్యపుస్తకాలలో చేర్చి, ఆయన ఉద్యమ ప్రస్థానం గురించి విద్యార్థులకు తెలియజేయాలని అన్నారు. జాతీయస్థాయిలో ఆయన సేవలను స్మరించుకునేలా 'కొండా లక్ష్మణ్ బాపూజీ జాతీయ అవార్డు' ఏర్పాటు చేసి, ప్రతి సంవత్సరం సామాజిక సేవ, ప్రజా ఉద్యమాలు, చేనేత రంగం, తెలంగాణ అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన వారికి ఈ పురస్కారాన్ని అందించాలని సాయినేత సూచించారు. అదేవిధంగా, కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలకు జాతీయస్థాయిలో తగిన గుర్తింపు కల్పించే దిశగా పద్మశ్రీ వంటి జాతీయ పురస్కారం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. సాధారణ నిబంధనల ప్రకారం మరణానంతరం పద్మ పురస్కారాల విషయంలో ఉన్న పరిమితులను పరిగణనలోకి తీసుకుంటూనే, బాపూజీ విశిష్ట సేవలను గుర్తించి ప్రత్యేకంగా పరిశీలించే మార్గాలను కేంద్ర ప్రభుత్వం అన్వేషించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సాధన కోసం జీవితాంతం పోరాడిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ



చరిత్రను భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలిపేలా ఆయన పేరుతో స్మారక కేంద్రం, జాతీయ అవార్డు, జిల్లాకు నామకరణం వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టాలని యలగందుల సాయినేత కోరారు.

## బుల్లెట్ ట్రైన్ సాధించుకునేందుకు పోరాటాలు నిర్వహిద్దాం


భానుపురి/సూర్యాపేట టౌన్

జాతీయ రహదారి 65 మీదుగా ముందుగా ప్రకటించిన బుల్లెట్ ట్రైన్ సాధించుకునేందుకు సూర్యాపేట జిల్లా ప్రజలు త్యాగాలకు సిద్ధం కావాలని ప్రముఖ వ్యాపారవేత్త గండూరి శంకర్ పిలుపునిచ్చారు. బుల్లెట్ ట్రైన్ సాధన అఖిలపక్ష పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు 39వ రోజు సోమవారం జిల్లా కుమ్మరీ సంఘం నాయకులు పాల్గొన్న కార్యక్రమంలో పాల్గొని సంఘీభావం తెలిపి మాట్లాడారు. 60 రోజులుగా జిల్లా కేంద్రం నుండి గ్రామాల వరకు కొనసాగుతున్న బుల్లెట్ ట్రైన్ సాధన పోరాటాన్ని పాలకులు పట్టించు కోక పోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఆకాంక్షను పట్టించుకోని పాలకులకు ఉద్యమాల ద్వారా బుద్ధి చెప్పాలని ఆయన అన్నారు. మునుముందు మరెన్నో ఉద్యమాలు చేపట్టి బుల్లెట్ ట్రైన్ దక్కించుకోవడం లక్ష్యంగా



ప్రజలు ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో పాల్గొన్న వారు కులవృత్తి సంబంధించిన కుండలు చేసే సారే మట్టి, తెచ్చి దీక్ష వద్ద ఉండలు చేసి నిరసన వ్యక్తం చేశారు. పూర్వకాలపు సారతో కుండలు చేయడానికి దీక్ష వద్ద పలువురిని ఆకర్షించింది. ఈ దీక్షలో కూర్చున్న వారు సలిగంటి శ్రీనివాస్ సలిగంటి వీరేందర్ , సలిగంటి నాగయ్య శివ మధుసూదన్, లింగయ్య గణేష్ జయ రామకృష్ణ, యాదగిరి ఉప్పలయ్య, నాగరాజు సతీష్ ఎల్లయ్య నాగార్జున సత్యం, మోహన్ కృష్ణమూర్తి వీరయ్య నారాయణ స్వామి నరసయ్య, చంద్రశేఖర్ రామారావు, రమేష్ బాబు లు దీక్షలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో సంఘీభావం తెలిపిన వారిలో టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వై వెంకటేశ్వర్లు, డాక్టర్ రామ్మూర్తి, రామారావు ఓపిడిఆర్ జిల్లా నాయకులు వీరభద్రయ్య,పాస్టర్లు మామిడి సాంసన్,దుర్గం ప్రభాకర్, జోహార్ పాల్ , సాయిని జాకబ్, అజరియా,డేవిడ్ నాయక్, పిలీప్, బుల్లెట్ ట్రైన్ సాధన సమితి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తి లో ఘనంగా గణపతి పూజలు



భానుపురి /వనపర్తి

వనపర్తి పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల ఎదుట వనపర్తి పట్టణ మహాగణపతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా పూజా కార్యక్రమాలు, హోమాలు ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ప్రతిరోజూ వేలాది మంది భక్తులు మహాగణపతిని దర్శించుకుని స్వామివారి ఆశీస్సులు పొందుతున్నారు. అందరికీ అందుబాటులో ఉండే ప్రధాన రహదారిపై భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఉత్సవ సమితి సభ్యులను శ్రీ వాసవి సేవా సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ పూరి సురేష్ శెట్టి ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా నిర్వహించిన గణపతి పూజ , హోమ కార్యక్రమంలో నరేష్--రజిత దంపతులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనం పొందారు.

## ఏబీఏపీ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శిగా టి.వి. పుల్లంరాజు ఏకగ్రీవ ఎన్నిక





భానుపురి/ శబరిమల

అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి గాతెలంగాణకు చెందిన డా.టి.వి. పుల్లంరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అఖిల భారతీయ అయ్యప్పధర్మ ప్రచారసభ (ఏబీఏపీ) ట్రస్ట్ నూతన కార్యవర్గ ఎన్నికలు సోమవారం శబరిమల నారాయణతోడు లోని అఖిలభారతీయ అయ్యప్పధర్మ ప్రచారసభ అన్నదాన మందిరంలో నిర్వహించారు. ప్రతి రెండేళ్లకోసారి జరిగే ట్రస్ట్ ద్వైవార్షిక ఎన్నికలను ఏబీఏపీ మేనేజింగ్ ట్రస్టీ పి.ఎన్.కె. మేనన్ ఎన్నికల అధికారిగా, ఏబీఏపీ ప్రధాన కార్యదర్శి బెల్లపు హరిప్రసాద్ పరిశీలకుల పర్యవేక్షణలో నిర్వహించారు.ఈ ఎన్నికల్లో కేరళకు చెందిన కె. అయ్యప్ప దాస్ అధ్యక్షులుగా, తెలంగాణకు చెందిన టి.వి. పుల్లంరాజు ప్రధాన కార్యదర్శిగా, తమిళనాడుకు చెందిన ఆర్. వెంకటేశన్ కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**-భక్తులకు మరింత మెరుగైన అన్నప్రసాద సేవలు**

ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన టి.వి. పుల్లంరాజు మాట్లాడుతూ, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఏబీఏపీ ట్రస్ట్ సేవలను మరింత విస్తరించేందుకు, ట్రస్ట్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా మండల-మకరవిళక్కు సీజన్‌లో శబరిమలకు వచ్చే అయ్యప్ప స్వామి భక్తులకు అన్నదాన మండపం ద్వారా నాణ్యమైన, రుచికరమైన అన్నప్రసాదాన్ని అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు.మండల-మకరవిళక్కు సీజన్‌లో సుమారు ఎనిమిది లక్షల మంది భక్తులకు అన్నప్రసాదం అందించే విధంగా ప్రణాళికలు రూపొందించి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని పుల్లంరాజు తెలిపారు.

**-తెలుగు రాష్ట్రాలకు గౌరవం**

అయ్యప్ప స్వామి భక్తుల సేవా ట్రస్ట్‌లో తెలుగు రాష్ట్రాలకు చెందిన వ్యక్తికి ప్రధాన కార్యదర్శి పదవి దక్కడం ఇదే ప్రథమమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పుల్లంరాజు ఏకగ్రీవ ఎన్నిక పట్ల తెలంగాణతో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన అయ్యప్ప స్వామి భక్తులు, ఏబీఏపీ ప్రతినిధులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు.ప్రధాన కార్యదర్శిగా పుల్లంరాజు ఎన్నిక కావడం ద్వారా శబరిమలలో అయ్యప్ప స్వామి భక్తులకు అందించే సేవల్లో తెలుగు రాష్ట్రాల భాగస్వామ్యం మరింత పెరగనుందని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా టి.వి. పుల్లంరాజును పలువురు అయ్యప్ప స్వామి భక్తులు, ఏబీఏపీ ప్రతినిధులు, ప్రముఖులు అభినందించారు.

## వినాయకుడి కృపతో బీవీ కాలనీ సుభిక్షంగా ఉండాలి

భానుపురి /సూర్యాపేట కల్చరల్

విఘ్నాలను తొలగించి విజయాలను ప్రసాదించే విఘ్నేశ్వరుడి నవరాత్రి ఉత్సవాలు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీవీ కాలనీలో భక్తిశ్రద్ధల మధ్య కొనసాగుతున్నాయి. ఈగల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ శ్రీ శ్రీ గణేష్ నవరాత్రి ఉత్సవాల మూడో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ గణేష్ నవరాత్రి ఉత్సవాల సహకారదాత, మాజీ మున్సిపల్ చైర్మన్ పెరుమాళ్ల అన్నపూర్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమానికి కాలనీ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. భక్తులకు ఆహారాన్ని అందించడం ద్వారా గణపతి సేవతో పాటు మానవ సేవ కూడా జరుగుతుందనే భావనతో నిర్వాహకులు ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ.. సకల విఘ్నాలను తొలగించే గణనాథుడి దీవెనలు బీవీ కాలనీ ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. వినాయక



నవరాత్రి ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే భక్తి, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో సుఖశాంతులు, సంతోషాలు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని, కుటుంబాలన్నీ సుభిక్షంగా ఉండాలని గణనాథుడిని ప్రార్థించినట్లు తెలిపారు.గణేష్ నవరాత్రి ఉత్సవాలను మూడు సంవత్సరాలుగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ వస్తున్న ఈగల్ యూత్ సభ్యులను కాలనీ ప్రజలు అభినందించారు.ఉత్సవాల్లో భాగంగా చేపడుతున్న సేవా కార్యక్రమాలు భక్తిలోని మానవతా విలువలను చాటుతున్నాయని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈగల్ యూత్ కమిటీ సభ్యులు బాలెంల సాయికుమార్, వేర్పుల శేఖర్, క్రాంతి, నయీమ్, మహేష్, ప్రసాద్, భరత్, నిహాల్ తదితరులు పాల్గొన్నారు.

## జల్ పల్లి డివిజన్ లో కాటన్ సెర్చ్



భానుపురి /జల్ పల్లి

జల్ పల్లి డివిజన్ లో పహడి షరీఫ్ పోలీస్ సిబ్బంది, ఎస్ఐ లక్ష్మయ్య యాదవ్, సి ఆర్ పి ఎఫ్ కమాండో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కాటన్ సెర్చ్ నిర్వహించారు. 50 మంది ఆర్మీ సిబ్బంది తో కలిసి. గణేష్ నిమజ్జనం సందర్భంగా జెల్ పల్లి లో ప్రశాంతంగా నిమజ్జనం కార్యక్రమం నిర్వహించాలని, ఎలాంటి ఆటంకాలు జరగకుండా భద్రతలో భాగంగా సెప్టెంబర్ 21న పహడి షరీఫ్ పోలీస్ సిబ్బంది ఆర్మీ బలగాలు కలిసి జలపల్లి డివిజన్ లో పలు కాలనీలలో కాటన్ సెర్చ్ నిర్వహించడం జరిగింది.


## విఘ్నేశ్వరుని ఆశీస్సులు వార్డు ప్రజలపై ఉండాలి



భానుపురి /సూర్యాపేట కల్చరల్

గణనాథుని ఆశీస్సులు వార్డు ప్రజలపై ఉండాలని శ్రీ వాసవి సేవా సమితి సభ్యులు, బిజెపి మహిళా నాయకురాలు వీరవెల్లి ఉమ తెలిపారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రాపోల్ల గుడి వద్ద బొడ్రాయి బజార్ యూత్ ఆధ్వర్యంలో గణపతి పూజలు, అన్న ప్రసాదం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ స్వచ్ఛమైన పాలన నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో గడ్డం మహేష్, అభి, జానీ, రఫీ, జగదీష్ రాచకొండ నరేష్, పిట్టల యుగేందర్ మనీ, రమేష్ , తదితరులు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరుని ఆశీస్సులు అందరిపై ఉండాలి





భానుపురి /సూర్యాపేట కల్చరల్

బ్రాహ్మణ కల్యాణం మండపంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహము దగ్గర యోగ సాధకులు పూజా నిర్వహించడం జరిగినది. పూజలో యోగ సాధకులతోపాటు యోగ గురువు పాపిరెడ్డి సతీమణి లక్ష్మీ లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా యోగ గురువు పాపిరెడ్డి ఆ భగవంతున్ని ప్రార్థిస్తూ యోగా సాధకుల తోపాటు వారి కుటుంబం కూడా ఆరోగ్యంగా ఉండాలని ఆనందంగా ఉండాలని అలాగే ప్రజలందరూ కూడా ఆరోగ్యంగా, ఆనందంగా గడపాలని ప్రార్థించుచున్నానని తెలిపారు. మన జీవితంలో ప్రతి ఒక్కరికి భక్తి భావం ఏర్పడాలని రోజు కొద్దిసేపైనా భక్తితో భగవంతుని ప్రార్థించడం వలన ఏకాగ్రత ఏర్పడి మానసిక ఒత్తిడి నుండి ఉపయోగముంటుందని మానసికంగా ఆరోగ్యంగా ఉండడానికి భక్తి భావం కూడా ఉపయోగపడుతుంది కావున ప్రతి ఒక్కరూ మనస్ఫూర్తిగా ఆ భగవంతున్ని ప్రార్థించాలని కోరడం జరిగింది.ఈ పూజా కార్యక్రమంలో బ్రాహ్మణ కళ్యాణ మండపం ప్రధాన కార్యదర్శి పూర్ణచంద్ర రావు శ్రీదేవి, సుజాత, కవిత, సామ్రాజ్యం, దివ్య, నవ్య, విజయ, ప్రసన్న, విజయ, స్వరూప, రాములమ్మ, మొదలగు సాధకులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల అక్రమాలను నిగ్గు తేల్చాలి

**-కలెక్టర్‌కు సీపీఎం వినతి**

భానుపురి /కట్టంగూర్

మండలపరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ మార్గదర్శకాలను ఉల్లంఘించి రైతులను నిలువుదోపిడీ చేసిన నిర్వాహకులపై చట్టపరింగా చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి పెంజర్ల సైదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బాధ్యులపై చర్యలు తీసకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు ఆయన తెలిపారు. మండలంలో పిఎసిఎస్, ఐకెపి, యన్డిసిఎంఎస్, హాకా తదితర సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిం చారని సైదులు ఆరోపించారు. కొనుగోలు సమయంలో అదనపు తూకాలు వేయడమే కాకుండా, హమాలి, లారీ రవాణా పేర్లతో ప్రతి బస్తాకు రూ. 10 చొప్పున అక్రమంగా వసూలు చేశారని మండిపడ్డారు. అంతేకాకుండా, కొనుగోలు కేంద్రాల్లో పోసిన ప్రతి ధాన్యం రాశికి రూ. 5,000 నుండి రూ. 10,000 వరకు రైతుల దగ్గర గుంజారని తెలిపారు. రైతులకు తప్పుడు కొనుగోలు పత్రాలు ఇస్తూ, కొనుగోలు కేంద్రాల్లో సీరియల్ బుక్కులు సరిగా నిర్వహించ కుండా అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. మిల్లుల వద్ద ఇచ్చే ట్రిప్ షీట్లలో ధాన్యాన్ని అదనంగా నమోదు చేయించుకుని, బినామీ పేర్లతో రైతుల సొమ్మును పక్కదారి పట్టించారని ఆరోపించారు. తక్షణమే ఈ అక్రమాలపై విచారణ జరిపి, బాధ్యులైన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మరియు రైతుల నుండి కాజేసిన సొమ్మును రికవరీ చేసి బాధితులకు అందజేయాలని ఆయన కలెక్టర్‌ను కోరారు.